అడిగితే అడ్డగింత..నిలదీస్తే నెట్టివేత

- పోలీసు పహారా మధ్య గ్రామ,వార్డు సభలు
- అనర్హుల ఎంపికపై పల్లెపల్లెన నిరసనలు
- రీ సర్వే చేయాలని ప్రజలు డిమాండ్
- గందరగోళంగా గ్రామసభలు

లాల్‌గడి మలక్‌పేట సభలో నిలదీస్తున్న మహిళలను పక్కకు నెట్టేస్తున్న వీఆర్‌ఓ

ఉద్దెమర్రిలో అధికారులను నిలదీస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు విష్ణుగౌడ్, వెంకటేశ్.

ఘట్‌కేసర్ పట్టణంలో జరిగిన వార్డు సభలో చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్‌ను నిలదీస్తున్న మహిళలు

మేడ్చల్, జనవరి 22 : నియోజకవర్గ వ్యాప్తంగా వార్డు గ్రామ సభల్లో మంగళవారం నాటి పరిస్థితి పునావృతమైంది. అడిగితే అడ్డుకుంటున్నారు ..నిలదీస్తే నెట్టేస్తున్నారు ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అంటు ప్రజలు మండి పడ్డారు. మూడు మండలాలు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్‌లలో అధికారులు వివిధ పథకాలపై గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించారు. ఈ సభల్లో ప్రజలు, నాయకులు ప్రభుత్వం తీరును ఎండగట్టారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక, రేషన్ కార్డు జాబితాలో పేర్లు లేకపోవడం పై నిరసనలు వెల్లువెత్తాయి. అధికారులను ఎన్నిసార్లు ధరఖాస్తులు చేయాంటూ నిలదీశారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో 10 వార్డుల్లో సభలు నిర్వహించారు. 9, 18 వార్డుల్లో జరిగిన సభల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఆయా సభల్లో ప్రజలు పథకాల ఎంపిక జాబితాపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ నేతలకు చుక్కెదురు

శామీర్‌పేట: గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ నేతలకు చుక్కలు కనిపిస్తున్నాయి. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి తమ పార్టీ పథకాలను అని ప్రచారం చేసుకునే ప్రయత్నం చేస్తూ లబ్ధిదారుల ఎంపికలో గందరగోళాన్ని సర్దిపుచ్చే ప్రయత్నం చేశారు. ప్రజలు ఒక్కసారిగా ఎదురుతిరిగారు మీ పార్టీ చేసిన నిర్వాకం చాలు ఏమైనా ఉంటే మీ ఊళ్లో చూపించుకోండి హెచ్చరించారు. దీంతో చతికిలవడిన ఆయన ఓ మూలను కూర్చుని సభ పాల్గొన్నారు. కాగా ఉద్దెమర్రి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నేతలు విష్ణుగౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌లు అధికారులపై విరుచుకుపడ్డారు. మీరు తప్పు చేస్తూ పార్టీని ఎందుకు బదులాంచేస్తారంటు ఆగ్రహించారు.

ఒక్క ఇంట్లనే ముగ్గురు ఎంపిక

ఒక్క ఇంట్లోనే ఇద్దరికి,ముగ్గురికి ఇందిరమ్మ ఇండ్ల పేర్లు వచ్చాయి. సర్వే చేసేటోల్లకో ఇందిరమ్మ కమిటీకో సోయి ఉండక్కర్లేదా. ఒక్కో కాందాన్‌ల ఒక్కలికి రాలేదు. వచ్చినోల్లకు రెండు మూడు ఇండ్లు వచ్చినయ్. ఇందేదని అడిగితే మల్ల దరఖాస్తు చేసుకోమంటున్నారు. ఇల్లు కావాలంటే ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలే.ఇప్పటికే ఆరు గ్యారెంటీలకు రెండుసార్ల దరఖాస్తు పెట్టుకున్న ఇది వచ్చేదేందో సచ్చేదేందో పో.

-గిరిపల్లి వెంకటేశ్, మూడుచింతలపల్లి మండలం.

మేడ్చల్ రూరల్: సోమారం గ్రామంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పోచారం మున్సిపాలిటీ 3వ వార్డు సభలో వేదిక వద్దకు వస్తున్న మహిళలను అదుపు చేస్తున్న పోలీసులు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్, జనవరి 22 : మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,ప్రజల తరపున ఉద్యమించాలని సూచించారు. ఎమ్మెల్సీని కలసిన వారిలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ ఉన్నారు.

మేడ్చల్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ ఉద్యమ గాయకురాలు వీణా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిబ్రవరి 2న జరుగనున్న తన వివాహానికి హాజరుకావాలని కోరుతూ వివాహపత్రికను అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మేడ్చల్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న చైర్ పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి

మేడ్చల్, జనవరి 22 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో వ్యాక్సినేషన్ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులను కౌన్సిలర్ మహేశ్‌తో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి బుధవారం ప్రారంభించారు. అలాగే గిర్మాపూర్‌లో ఎస్సీ శ్మశాన వాటికను, 18వ వార్డులో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్లు లావణ్య హనుమంత్‌రెడ్డి, భవానీరాఘుందర్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చీర్ల రమేశ్, కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతలు

మల్కాజిగిరి, జనవరి 22: అనధికార విద్యుత్ కోతలతో విని యోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ వాణినగర్ కాలనీలో ఐశ్వర్య అపార్టుమెంట్ కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేశామని సంబంధిత ఏఈ గోపాల్ తెలిపారు. ఈ విషయమై డీఈ అన్వర్‌పాషాని వివరణ కోరగా తనకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. గతంలో ఈ కాలనీలో ముందస్తు సమాచారం లేకుండా చెట్ల కొమ్మలను తొలగించారు. 11కేవి విద్యుత్ లైన్ నిలిపివేయడానికి ముందస్తుగా ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీఅదేమీ స్థానిక అధికారులు పాటించడంలేదు.

చెత్త నిర్వహణలో ఆధునిక పద్ధతులు అనుసరించాలి

పీర్జాదిగూడ డంపింగ్‌యార్డులో ఎస్‌డబ్ల్యూఎం మిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క , మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

పీర్జాదిగూడలో ఎస్‌డబ్ల్యూఎం మిషన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

పీర్జాదిగూడ, జనవరి 22: చెత్త నుంచి విముక్తి చేయడానికి జిల్లా, పట్టణ కేంద్రాల్లో చెత్త రీసైక్లింగ్ చేసే సెంటర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముందని, చెత్త నిర్వహణలో ఆధునిక పద్ధతులు అనుసరించాలని పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపూర్‌లోని డంపింగ్‌యార్డులో ఐటీసీ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూఎం (సాలీడ్ వేస్ట్ మేనేజిమెంట్) మిషన్‌ను ఆమె, మాజీ మంత్రి మల్లారెడ్డి,మేయర్ అమర్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిశేశ్వర్‌రావు, కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు

డంపింగ్ యార్డు తరలించాలి

పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని డిమండ్ చేస్తూ బీజేపీ నేతలు, స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు సర్దిచెప్పి వారిని పంపించారు.

సమయపాలన పాటించాలి

పీర్జాదిగూడ, జనవరి22: పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి మేడిపల్లిలోని బస్తీ దవాఖాన, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణుల పరీక్షలు, ప్రసవాలు, ల్యాబ్ సేవలు, రోగనిర్ధారణ, ఫార్మసీ స్టాక్, మందుల నిల్వలను పర్యవేక్షించారు. జిల్లా డ్రగ్స్‌స్టోర్ నుంచి అవసరమైన మందులను సేకరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన వైద్య అధికారులు, సిబ్బంది సమయంపాలన పాటించాలని సూచించారు.

భగత్‌సింగ్ కాలనీలోని బస్తీదవాఖాన పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌స్వామి

మౌలిక వసతులు కల్పిస్తాం:ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మల్కాజిగిరి, జనవరి 22: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మచ్చ బొల్లారంలోని సెలెక్ట్ టాకీస్ నుంచి మార్కెట్‌కు వెళ్లే దారి గుంతలుపడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు బుధవారం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులతో సర్వే చేయించి త్వరలో సీసీ రోడ్డును నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ సేవా సమితి ఛైర్మన్ నర్ల సురేష్, అంజి రెడ్డి, శ్రీరాములు, చంద్రారెడ్డి, దశరథ్, బాలేష్, అజ్జు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ల సమస్యలు పరిష్కరిస్తాం

జర్నలిస్ట్‌ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి అన్నారు. బుధవారం అల్వాల్‌కు చెందిన జర్నలిస్ట్ వర్మ తండ్రి పెన్మత్స నరసింహ రాజు మరణించడంతో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

శామీర్‌పేట/నేరేడ్‌మెట్: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వినాయకనగర్ డివిజన్‌కు చెందిన సుమకు రూ. 60వేలు, దివ్యకు రూ.42వేలు, గణేష్‌రావుకు 18వేల ఎల్ఓసీ చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆయా కుటుంబాలకు అందజేశారు. ఎమ్మెల్యేకు ఆయా కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి పరశురాం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, కరీం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు రూ.8500లు, రవి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

చర్లపల్లి: కుషాయిగూడలో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి

చర్లపల్లి, జనవరి 22: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో సుమారు రూ.18లక్షల నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్‌లతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని,ముఖ్యంగాడ్రైనేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణం పనులు చేపడుతామని, డివిజన్‌లలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తేవెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ సందీప్, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, శివకుమార్ గౌడ్, సీతారామిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కరీం, బాల్ నర్సింహ, చక్రపాణిగౌడ్, అనిల్‌కుమార్, బాబుగౌడ్, కిశోర్‌గౌడ్ , అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతాం

మల్లాపూర్:కాలనీల్లో ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాలనీ గుర్తుల సైన్ బోర్డులు, అలాగే కమ్యూనిటీ హాల్ షెడ్‌ను కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి నరేందర్‌రెడ్డి, సలహాదారులు , నాయకులు జంపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, రమేష్, బాలయ్యగౌడ్, నిసార్‌అహ్మద్‌గోరి, నరేందర్, పాల్గొన్నారు.

రైతు భరోసాకు 159మంది అనర్హులు

కాప్రా, జనవరి 22: కాప్రా మండలంలో రైతు భరోసాపై సర్వేనుఅధికారులు పూర్తి చేశారు. మండలం పరిధిలో మొత్తం 203 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్టు రికార్డుల్లో ఉండగా, కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది రీసర్వే నిర్వహించి 149మందికి సంబంధించి 159 ఎకరాలను(కాప్రా-110 ఎకరాలు, చర్లపల్లి -36 ఎకరాలు) నాన్ అగ్రికల్చరల్‌గా, రైతు భరోసాకు అనర్హమైనవిగా గుర్తించి వాటిని జాబితా నుంచి తొలగించారు. 43.33 ఎకరాలు మాత్రమే రైతు భరోసాకు అర్హమైన వ్యవసాయ భూములుగా గుర్తించినట్టు తహసీల్దార్ తెలిపారు. మండల పరిధి వంపుగూడ సర్వే నంబర్ 104 పరిధిలోని సుమారు 30 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కాపాడి అక్కడ ప్రభుత్వస్థల మని పేర్కొటూ బోర్డును పాతినట్టు తహసీల్దార్ తెలిపారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన

రామంతాపూర్,జనవరి 22: రోడ్డు భద్రత పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మాజీ ఐఏఎస్ అధికారి పి. జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో రోడ్డు భద్ర తా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగించారు. అదే విధంగా ఉప్పల్ చౌరస్తాలో బాటసారులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోమోటార్ వెహికిల్ ఇన్స్‌పేక్టర్ రవీందర్‌రెడ్డి,శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోచారం,జనవరి22: పోచారం మున్సిపాలిటీలో బుధవారం రూ.3.20కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు చైర్మన్ కొండల్ రెడ్డి,కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. 5వ వార్డు అన్నోజిగూడలో వైకుంఠధామం,డ్రైనేజీ, ఎస్సీ వైకుంఠధామం7వవార్డు రాజీవ్ గృహకల్పలో డ్వాక్రా భవనం అదనపు అంతస్తు,డ్రైనేజీ ప్రారంభం,13వ వార్డు పోచారంలో సీసీ రోడ్డు ప్రారంభం,నీటి ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలించిన నాయకులు,14,15 వార్డులలో సీసీ రోడ్లు ,డ్రైనేజీ ప్రారంభం,17వ వార్డులో వైకుంఠ ధామం,4వ వార్డు లక్ష్మీనర్సింహకాలనీలో డ్రైనేజీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ రెడ్డ్యానాయక్,కౌన్సిలర్లు, నాయకులు మాజీ సర్పంచ్ చిన్ననర్సింహగౌడ్, నర్సింహ, బుచ్చిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

జవహర్‌నగర్, జనవరి 22: వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి యాప్రాల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... యాప్రాల్ ప్రాంతంలో కందగట్ల భాగ్య(63) కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 6న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

1189మందికి రైతు రుణమాఫీ

మాట్లాడుతున్న చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 22: ఘట్‌కేసర్ మండలానికి చెందిన 1189 మంది రైతులకు రుణమాఫీ మంజూరు అయినట్లు మండల రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 1230 మందికి గాను 41 మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాలేదని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ అనంతర రెడ్డి, డైరెక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, జడిగే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాలు కబ్జా చేస్తే ఊరుకోం..

ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్థానిక యువకులు

జవహర్‌నగర్, జనవరి 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యువతకు క్రీడా మైదానం ఉండాలని స్టేడియాన్ని కేటాయిస్తే... కాంగ్రెస్ ప్రభుత్వంలో కబ్జాకు గురవుతుందని, కబ్జాచేసే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హెచ్చరించారు. జవహర్‌నగర్ క్రీడా మైదానానికి కేటాయించిన స్థలంలో సర్వే నెం. 704, 706లో అక్రమంగా కొందరు కబ్జాదారులు నిర్మాణాలు చేస్తున్నారని... వారిపై చర్యలు తీసుకోని కాపాడాలని కోరుతూ మాజీ మేయర్ మేకల కావ్య, ఉద్యమకారుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో జవహర్ నగర్ యువకులు బుధవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. సర్కారు భూములపై అక్రమార్కులు నజర్ వేస్తే ఊరుకోబమని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువకులు నరేందర్‌యాదవ్, కార్తీక్‌రెడ్డి, విక్రమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మేడ్చల్ రూరల్ , జనవరి 22: మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామ శివారులో కేదార్‌నాథ్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో దేవ్ భూమి ఉత్తరాఖండ్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ దక్షిణేశ్వర్ కేదార్‌నాథ్ మందిరాన్ని నిర్మిస్తున్నారు. అందుకు గాను బుధవారం పెద్ద ఎత్తున భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించగా కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని పూజ చేశారు.

హోటల్‌లో బాల కార్మికురాలుగుర్తింపు

పోచారం,జనవరి22: పోచారం మున్సిపాలిటీ జోడిమెట్ల వద్ద గల ఓ హోటల్‌లో పనిచేస్తున్న బాల కార్మికురాలిని పోలీసులు బుధవారం గుర్తించారు.ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా,పోచారం సీఐ రాజు వర్మ ఆధ్వర్యంలో పోలీసులు ఇక్కడి పలు వ్యాపార దుకాణాలను తనిఖీ చేశారు.ఇక్కడి శ్రీసాయి హోటల్‌లో పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన 16 సంవత్సరాల బాలికను పోలీసులు రక్షించారు.హోటల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన

రామంతాపూర్,జనవరి 22: రోడ్డు భద్రత పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మాజీ ఐఏఎస్ అధికారి పి. జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో రోడ్డు భద్ర తా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగించారు. అదే విధంగా ఉప్పల్ చౌరస్తాలో బాటసారులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోమోటార్ వెహికిల్ ఇన్స్‌పేక్టర్ రవీందర్‌రెడ్డి,శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలో పేర్లు గల్లంతు.. రచ్చకెక్కిన కాంగ్రెస్ నేతలు

కీసర, జనవరి 22: ఇందిరమ్మ కమిటీలో పేర్లను చూసి షాక్ అయ్యామని మండల కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కీసరలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీకి సంబంధించి రెండుమార్లు కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించామని, ఆ సమావేశంలో ఇందిరమ్మ కమిటీకి సంబంధించిన లిస్టులను తీర్మానం చేసి పంపిన లిస్టులో పేర్లు గల్లంతు కావడంతో తాము ఒక్కసారిగా షాక్‌కు గురి అయ్యామన్నారు. కీసరలో బీసీలకు సంబంధించి ఎంతోమందికి మాట ఇచ్చామని, ఆ లిస్టులో తీరా బీసీకి బదులు ఓసీల పేర్లు రావడం చాలా బాధకరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిక్కుడు రమేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కీసరలో రెడ్డి వర్గంలో విజయ్‌రెడ్డికి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉన్నా, గ్రామ స్థాయిలో మళ్లీ విజయ్‌రెడ్డి భార్య స్వప్నకు ఇందిరమ్మ కమిటీలో సభ్యురాలుగా చోటు దక్కడం ఏంటని అన్నారు. మేడ్చల్ ఇన్‌చార్జి జంగయ్యయాదవ్ విజయ్‌రెడ్డికే ప్రాధాన్యత ఇస్తున్నాడని, మిగతా వారికి పదవులు ఇవ్వోద్దా అని నిలదీశారు. అందరికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్త, మాజీ పంచాయతీ సభ్యులు బి. శంకర్‌గౌడ్, ఎస్. నర్సింహచారీ, ఖాజామెయినోద్దిన్, చినింగని నర్సింహలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

శామీర్‌పేట,జనవరి 22: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడవద్దని, ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. గ్రామ, వార్డు సభల్లో నోటీసు బోర్డుల్లో ఉంచిన జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికా రుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిల్పాయాదగిరి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొల్తూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి.

ఎమ్మెల్సీ కవితతో కలిసి గిరిప్రదిక్షణలో కార్పొరేటర్

జవహర్‌నగర్, జనవరి 22: యాదాద్ర